సాక్షి
కుమురం భీం
శనివారం । 30 । మార్చి । 2024



ట్ర(డ)బుల్ డ్యూటీలు..!
వరున డ్యూటీలు, నిద్రలేమి, పని ఒత్తిడితో ఆర్టీసీ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. డబుల్ డ్యూటీలను వారు తట్టుకోలేక పోతున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని: 6:31	ఆది: 4:49

గరిష్టం/కనిష్టం
39.7 /27.8

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పన్నులు సకాలంలో చెల్లించాలి



పన్ను వసూలు చేస్తున్న కమిషనర్

ఆసిఫాబాద్‌అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, వ్యాపార సముదాయాల యజమానులు పన్నులు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ భుజంగరావు అన్నారు. పట్టణంలోని వ్యాపార సముదాయాల్లో శుక్రవారం సిబ్బందితో కలిసి పన్నులు వసూలు చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31లోగా పన్నులు చెల్లించాలని, ఏప్రిల్ 1 నుంచి 20 జరిమానా కట్టాల్సి ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ఆనందం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సారంగపాణి, బిల్ కలెక్టర్ నాగేందర్, వార్డు అధికారి భద్రయ్య, సిబ్బంది వంశీ, జంజిరాల ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి



కవాతు చేస్తున్న డీఎస్పీ, పోలీసులు

రెబ్బెన(ఆసిఫాబాద్): లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ సదయ్య అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వరకు కేంద్ర పోలీసు బలగాలు, పోలీసు సిబ్బందితో కలిసి శుక్రవారం కవాతు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్గవిభేదాలు లేకుండా శాంతియుతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని అన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని, ఓటర్లకు పోలీసుశాఖ పూర్తి భద్రత కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

'వేతనాలు చెల్లించకుంటే నిరవధిక సమ్మె'



నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: టీవీవీపీ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేని పక్షంలో ఏప్రిల్ 1 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీ ఎదుట శుక్రవారం సిబ్బందితో కలిసి నిరసన తెలిపారు. అనంతరం డాక్టర్ రానాకు వినతిపత్రం అందించారు. జిల్లా ఏరియా ఆస్పత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న కాంట్రాక్టు, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. మల్లేశ్, సత్తార్, లక్ష్మణ్, హరీశ్, నవీన్ పాల్గొన్నారు.

తాగునీటి కటకట

- మార్చిలోనే మొదలైన ఎద్దడి
- ఏజెన్సీ ప్రాంతాల్లో అడుగంటిన భూగర్భ జలాలు
- పని చేయని చేతి పంపులు
- అస్తవ్యస్తంగా మారిన 'మిషన్ భగీరథ'
- నిర్మించి ఏళ్లు గడుస్తున్నా వృథాగానే ట్యాంకులు, నల్లాలు
- కనెక్షన్లు ఇవ్వడంలో సంబంధిత అధికారుల అలసత్వం

మార్చిలోనే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు పెరిగి వేడికి చెరువులు, వాగుల్లో నీటి వనరులు ఆవిరైపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా తాగునీటి కటకట మొదలైంది. మిషన్ భగీరథ పథకం నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడంతో పట్టణాలు, పల్లెల్లో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో తాగునీటి కష్టాలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..



దహెగాం మండలం ఐనం గ్రామంలోని బావికి బిగించిన మోటార్లు

గ్రౌండ్ రిపోర్ట్

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ సమీపంలో 1, 2 ఫేజ్ ద్వారా రూ.1650 కోట్లతో నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించారు. రూ.115 కోట్లతో 115 ఎంఎల్‌డీ నీటిశుద్ధి కేంద్రం నిర్మించారు. ఇక్కడి నుంచి కుడివైపు జిల్లాలోని 10 మండలాల్లోని 622 ఆవాసాలకు నీటి సరఫరా చేయాల్సి ఉంది. ఎడమవైపు ధనోరా వద్ద 12, 30 ఎంఎల్‌డీ నీటిశుద్ధి కేంద్రం ద్వారా ఐదు ఏజెన్సీ మండలాలల్లోని 479 ఆవాసాలకు తాగునీటి సరఫరా చేయాలి. పథకంలో భాగంగా 1,746 కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ (ఇంట్రా విలేజ్) కింద జిల్లాలోని 1,144 ఆవాసాలకు తాగు నీరందించేందుకు 1233.90 కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్ మంజూరు చేశారు. 2021 ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. నేటికీ మరమ్మతులు, పైప్‌లైన్ పనులతో జాప్యం జరుగుతోంది. ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

ఐనంలో బావి నీరే ఆధారం

దహెగాం: ఐనం గ్రామంలో బావాజీపటేల్ వాడకు ఇప్పటివరకు మిషన్ భగీరథ తాగు నీరు సరఫరా చేసిన దాఖలాలు లేవు. అక్కడి ప్రజలు ఇప్పటికి బావి నీటినే తాగుతున్నారు. అలాగే రోడ్ ఏరియాలో కూడా కొన్ని ఇళ్లకు నీటి సరఫరా లేదు. రోడ్డు పక్కనే ఉన్న రెండు బావులకు మోటార్లు బిగించుకున్నారు. విద్యుత్ ఉంటేనే మోటార్లు పని చేస్తాయి. మండలంలో మొత్తం 411 చేతి పంపులు. 65 బావులు ఉండగా.. 7,610 నల్లా కనెక్షన్లు ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.



కౌటాల మండలం జనగాంలో చేతిపంపు వద్ద తాగునీటిని పట్టుకుంటున్న స్థానికులు

చేతిపంపులే దిక్కు

కౌటాల: తుమ్మిడిహెట్టి పంచాయతీ పరిధిలోని జనగాంలో 70 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ 300 మంది నివసిస్తుండగా మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. చేతి పంపుల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. మూడు చేతిపంపుల్లో రెండు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. పాఠశాల వద్ద చేతిపంపు పనిచేయక విద్యార్థులు, ఎస్టీ కాలనీ వాసులు తాగునీటికి తిప్పలు పడుతున్నారు. గుండాయిపేటలోని ఎస్సీ, బీసీ కాలనీలకు భగీరథ నీరు అందడం లేదు. బోర్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఇక్కడ 250 మంది నివాసం ఉంటున్నారు. కౌటాల మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో 398 చేతి పంపులు, 226 బావులు ఉన్నాయి. అలాగే 8703 మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నాయి.

చింతలమానెపల్లి: మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 35 గ్రామాలు ఉన్నాయి. 8,387 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఆడెపల్లి, గంగాపూర్, రవీంద్రనగర్, డబ్బా గ్రామాల్లోని కొన్ని వాడల్లోనే నీటి సరఫరా జరుగుతోంది. మండల కేంద్ర ప్రజలు మినరల్ వాటర్ కొనుక్కొని తాగుతున్నారు. స్థోమత లేని వారు చేతిపంపుల నీటిని తెచ్చుకుంటున్నారు. రహదారుల విస్తరణ, ఇతర పనులతో మిషన్ భగీరథ పైప్‌లైన్లు పలిగిపోయాయి. మరమ్మతుల కోసం రూ.40 లక్షలు మంజూరయ్యాయని త్వరలోనే పనులు నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు. వేసవిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

పెంచికల్‌పేట్: మండలంలో 12 పంచాయతీలు ఉండగా 25 గ్రామాలు ఉన్నాయి. 25 ట్యాంకుల ద్వారా 3,600 నల్లా కనెక్షన్‌లతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గిరిజన గ్రామాలైన మురళీగూడ, జిల్లెడ గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు కమ్మర్‌గాం వద్ద పంపు ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్య ఏర్పడితే నీటి సరఫరాలో అంతరాయం ఉంటుంది.

ఏడాదిగా వృథాగానే..



నిరుపయోగంగా వాటర్ ట్యాంకు

వాంకిడి: ఈ ఫొటోలో కనిపిస్తున్న వాటర్ ట్యాంకు నవేగాం గ్రామ పంచాయతీ పరిధిలోని టోకిగూడ గ్రామంలోనిది. ఆదివాసీలు నివాసం ఉంటున్న టోకిగూడ, ఉర్వెతగూడ, టోకిగూడ-2లో 50కి పైగా కుటుంబాలు ఉన్నాయి. గతేడాది వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. నల్లాలకు కనెక్షన్ ఇవ్వలేదు. చేతిపంపులు ఉన్నా తరచూ దెబ్బతింటున్నాయి. కిలోమీటరు దూరానికి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీళ్లు వస్తలేవు



గ్రామంలో సక్రమంగా మిషన్ భగీరథ నీళ్లు వస్తలేవు. రెండు చేతి పంపులే ఆధారం. ఏటా వేసవిలో తాగునీటి ఇబ్బందులు తప్పడంలేదు. పాఠశాల విద్యార్థులు కూడా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.
– మడావి నిర్మల, జనగాం, మం.కౌటాల

ప్రతిరోజూ సరఫరా చేయాలి



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నీటి అవసరాలు అధికంగా ఉంటాయి. వేసవిలో కాలనీ వాసులకు తిప్పలు తప్పడం లేదు. మిషన్ భగీరథ నీటిని ప్రతిరోజూ సరఫరా చేయాలి. నీటి సరఫరాను ఉన్నతాధికారులు పర్యవేక్షించాలి.
– జంజిరాల కమలమ్మ, బ్రాహ్మణవాడ, ఆసిఫాబాద్

ఏజెన్సీలో నీటి గోస

- గిరిజన గ్రామాల్లో నిత్యం భగీరథ నీటి సరఫరాలో అంతరాయం
- ఎడ్లబండ్లతో నీటిని తెచ్చుకుంటున్న ప్రజలు
- చేతిపంపులు పనిచేయక అవస్థలు

లింగాపూర్: వంకామద్ది గ్రామంలో సుమారు 60 నివాసాలు, 200 వరకు జనాభా ఉంటుంది. ఇక్కడ మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీరు వారానికి ఒక్కరోజు మాత్రమే సరఫరా అవుతుంది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో గ్రామానికి చివర ఉన్న చేతిపంపు పని చేయడం లేదు. గత ప్రభుత్వ హయాంలో వేయించిన బోర్‌వెల్‌కు పంచాయతీ అధికారులు మోటార్ బిగించలేదు. ఫలితంగా మూడు కిలోమీటర్ల దూరంలోని బావి లేదా చెరువు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మోతీపటార్ గ్రామంలో 120 నివాసాలు ఉండగా.. 730 మంది నివాసం ఉంటున్నారు. ఇక్కడ భగీరథ నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. కొన్ని ఇళ్లకు ఇప్పటికీ కనెక్షన్ కూడా ఇవ్వలేదు. పశువులు కూడా దాహార్తికి అల్లాడుతున్నాయి. సమీపంలోని బావి నుంచి తెచ్చుకున్న నీటిని రెండు, మూడు రోజుల వరకు వాడుకుంటామని గ్రామస్తులు తెలిపారు. జాముల్‌ధార, పిక్లాతండా, లింగాపూర్, పిట్టగూడ, దాంపూర్, కిమానాయక్ తండా, కొత్తపల్లి గ్రామాల్లోనూ తాగునీటి సమస్య ఉంది.



వంకమద్దిలో ఎడ్లబండితో నీళ్లు తెచ్చుకుంటున్న గ్రామస్తుడు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మోతీపటార్ గ్రామస్తులు

గుట్టలపై గ్రామాలు



కొలంగూడలో నిరుపయోగంగా మిషన్ భగీరథ పైపు

తిర్యాణి: మండలంలో అనేక గ్రామాలు గుట్టలపై ఉన్నాయి. ఆయా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయడంలో అవంతరాలు ఏర్పడుతున్నాయి. గోవెన, మంగీ, టోకిగూడ, భీమ్‌రెల్ల, కొలాంగూడ, గుండాలలో నీటి సమస్య అధికంగా ఉంది. కాంట్రాక్టర్లు నాణ్యత పాటించకపోవడంతో భగీరథ నీటి ట్యాంకులు పగుళ్లు తేలి లీకేజీలు ఏర్పడుతున్నాయి. కొలాంగూడలో 22 కుటుంబాలు కేవలం ఒకే బోరుపై ఆధారపడి అవసరాలు తీర్చుకుంటున్నాయి.

అలంకారప్రాయంగా నల్లాలు



కల్లెగాంలో అలంకారప్రాయంగా నల్లా

కెరమెరి: కల్లెగాంలోని 35 కుటుంబాలకు రెండు చేతిపంపులు ఉన్నాయి. ఒకటి మాత్రమే సక్రమంగా పని చేస్తుంది. భగీరథ ట్యాంకు నిర్మించి నాలుగేళ్లు అవుతుంది. నీటి సరఫరా లేక నల్లాలు అలంకారప్రాయంగా మారాయి. పాట్నాపూర్ కొత్తగూడలో 13 కుటుంబాలకు ఒకే చేతిపంపు ఉంది. అది కూడా సరిగా పనిచేయడం లేదు. 5000 లీటర్లతో మినీ ట్యాంకు ఉన్నా వారి నీటి అవసరాలు తీరడం లేదు. బావి మంజూరు చేయాలని కోరుతున్నారు. కోటా, మహరాజ్‌గూడ, ముకదంగూడలో నీటి ఎద్దడి కనిపిస్తోంది.

తీవ్రంగా సమస్య



మా గ్రామంలో వారానికి ఒక్కసారి భగీరథ నీళ్లు వస్తాయి. ఆ నీటినే రెండు, మూడు రోజులపాటు వినియోగించుకోవాలి. నల్లా కనెక్షన్లు కూడా అందరికి లేవు. కొన్ని ఇళ్లకే నీళ్లు చేరతాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఎడ్లబండ్లపై డ్రమ్ముల్లో నీటిని తెచ్చుకుంటాం. – జాదవ్ గజానంద్‌నాయక్, వంకామద్ది, మం.లింగాపూర్

నీళ్లు రావడం లేదు



మేమంతా మారుమూల ఏజెన్సీ ప్రాంతలో నివసిస్తున్నాం. ఎండలు పెరగడంతో తాగు నీటికి ఇబ్బంది అవుతుంది. భగీరథ నీళ్లు కూడా సక్రమంగా రావడం లేదు. అధికారులు దృష్టి సారించాలి.
– జాదవ్ నాను, మోతీపటార్, మం.లింగాపూర్

మస్తు కష్టంగా ఉంది



మా ఊరికి భగీరథ నీరందడం లేదు. ఒకే బోర్‌వెల్‌తో గ్రామంలోని వంద మంది అవసరాలు తీర్చుకోవాలి. బోర్ వద్ద లైన్‌లో నిలబడాలి. మస్తు కష్టంగా ఉంది. మరో బోరు వేయించడంతోపాటు భగీరథ నీటిని సరఫరా చేయాలి. – చంద్రకాంత్, కొలాంగూడ, మం.తిర్యాణి



పెద్దవాగు ఒడ్డున పట్టుకున్న బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు(ఫైల్)

గుడుంబా జోరు!

- నీటి కొరత లేకుండా నదులు, వాగుల పరీవాహక ప్రాంతాల్లో తయారీ కేంద్రాలు
- గుట్టుచప్పుడు కాకుండా దుకాణాలకు తరలింపు
- తనిఖీలు పెరగడంతో ఎన్నికల వేళ భారీగా పట్టుబడుతున్న వైనం

చింతలమానెపల్లి/పెంచికల్‌పేట్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలో చేపడుతున్న తనిఖీలో భారీగా గుడుంబా పట్టుబడుతోంది. తయారీ స్థావరాలపై ఎక్సైజ్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహిస్తూ.. కేసులు నమోదు చేస్తుండటంతో తయారీదారులు పంథా మార్చుకుంటున్నారు. పెద్దవాగు, ఉచ్చమల్లవాగు, ప్రాణహిత తీరాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు.

నదీతీర ప్రాంతాల్లో తయారీ కేంద్రాలు.

జిల్లాలో సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల్లోని పెన్‌గంగ, ప్రాణహిత నదీతీర ప్రాంతాల్లో గుడుంబా తయరీ కేంద్రాలు విస్తరించి ఉన్నాయి. తీర ప్రాంతాల్లోని చెట్ల పొదలు, వ్యవసాయ భూముల్లో నాటుసారా తయారు చేసేందుకు వినియోగించే వేల లీటర్ల బెల్లం పానకం పట్టుబడుతోంది. మండల కేంద్రాలు, పట్టణాల్లోని దుకాణాల నుంచి గుడుంబా తయారీకి కావాల్సిన ముడి సరుకు నల్ల బెల్లం, పటిక, ఇతర పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. నీటికొరత లేకుండా పెద్దవాగు, బొక్కివాగు, ఉచ్చమల్లవాగు పరీవాహక ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేసి పగలే గుడుంబా కాస్తున్నారు.

ఉపాధి మార్గంగా ఎంచుకుని

నాటుసారా వినియోగించే వారి సంఖ్య ఏటా పెరుగుతుండటంతో తయారీ కూడా కొంతమందికి ఆదాయ వనరుగా మారింది. జిల్లాలో కొంతమంది దీనిని జీవనోపాధిగా మార్చుకుని రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో తయారు చేసి పోలీసులకు చిక్కకుండా చిన్నచిన్న దుకాణాల నుంచి బెల్టుదుకాణాల వరకు సరఫరా చేస్తున్నారు. ప్లాస్టిక్ క్యాన్లు, సీసాలు, పాలిథీన్ కవర్లలో ప్యాకింగ్ చేసి గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తుంటారు. పట్టుబడకుండా తగిన సమాచార వ్యవస్థతో నాటుసారా సరఫరాదారులు వ్యవహరిస్తుండడం పోలీసులకు సవాల్‌గా మారింది.

తనిఖీలు ముమ్మరం..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం అక్రమ కార్యకలాపాల నియంత్రణపై దృష్టి సారించింది. ప్రధానంగా పోలీసు, అబ్కారీ శాఖలు మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై చర్యలు చేపడుతున్నాయి. గ్రామాల్లో గుడుంబా తయారీదార్లు, విక్రయించేవారిపై నిఘా ఉంచారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత 362 లీటర్ల నాటుసారా పట్టుకోగా.. దీని విలువ రూ.1.83లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఇటీవల కేసులు

- ఈ నెల 22న పెంచికల్‌పేట్ మండలం చేడ్వాయి సమీపంలోని పెద్దవాగు ఒడ్డున నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2500 లీటర్ల బెల్లం పానకం, తయారీ సామగ్రిని ఎక్సైజ్, పోలీసు సిబ్బంది ధ్వంసం చేశారు.
- ఈ నెల 25న దరోగపల్లి గ్రామ సమీపంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500లీటర్ల బెల్లం పానకాన్ని పారబోసి జెట్టి మహేశ్‌పై కేసు నమోదు చేశారు.
- చింతలమానెపల్లి మండలంలోని బాబాసాగర్ గ్రామంలో కిరాణ దుకాణంలో నిల్వ ఉంచిన పది లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.
- కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామంలో కిరాణా దుకాణంలో నిల్వ ఉంచిన 12లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 26న చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్ గ్రామంలోని కిరాణా దుకారంలో ఐదు లీటర్లను స్వాధీనం చేసుకున్నారు. అదేరోజు జైనూర్ మండలం శివునూర్‌లోని ఓ మహిళ ఇంట్లో 20 లీటర్లు పట్టుకున్నారు.
- ఈ నెల 29న సిర్పూర్(టి) మండలం చింతకుంటలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. గుడుంబా, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

బెల్టుదుకాణాలపై చర్యలేవి..?

ఓ గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టుదుకాణాలపై చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా బెల్టు దుకాణాల్లో పట్టపగలే మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. మరోవైపు కల్తీ మద్యం అమ్మకాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ లైసెన్స్‌డ్ మద్యం దుకాణంలో మద్యం కల్తీ చేసి విక్రయించిన విషయం తెలిసిందే. మద్యం దుకాణాలు, బెల్టు షాపుల్లోనూ తనిఖీలు చేపట్టి మద్యం కల్తీ కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత



ఎస్‌ఎస్‌టీ సిబ్బందికి నగదు ఇస్తున్న పోలీసులు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శుక్రవారం 52,400 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా బెల్లంపల్లికి చెందిన రాంభట్ల వేణుగోపాల్‌శర్మ వద్ద నగదు లభించడంతో సీజ్ చేసి ఎస్‌ఎస్‌టీ సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు



పట్టుకున్న గుడుంబాతో ఎస్సై

కోటపల్లి: గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజేందర్ అన్నారు. రాంపూర్ గ్రామానికి చెందిన దూర్కె శంకరయ్య గుడుంబా తయారు చేస్తుండగా ఎస్సై పట్టుకుని కేసు నమోదు చేశాడు. 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజేందర్ పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలతో ఒకరి ఆత్మహత్య

నేరడిగొండ: ఆస్తి తగాదాలతో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మండలంలోని రాజులతండా గ్రామానికి చెందిన మాలి నూర్‌సింగ్ (49)కు కొడుకు అంకుష్‌తో ఆస్తి తగాదాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శుక్రవారం అంకుష్ తండ్రితో ఆస్తి పంపకం చేయాలని గొడవకు దిగాడు. ఇది నచ్చని నూర్‌సింగ్ పంటచేనులో పురుగుల మందు తాగాడు. అతడి భార్య సూరజాబాయి గమనించి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి ఆటోలో అతడిని చికిత్స కోసం బోథ్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొద్దిరోజులుగా తండ్రీకొడుకుల మధ్య ఆస్తి తగాదాల విషయమై వారి కుల పెద్దల వద్ద పంచాయితీలు జరిగినట్లు సమాచారం. మృతుడి భార్య సూరజాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నిర్మల్‌టౌన్: మామడ మండలం న్యూలింగంపల్లికి చెందిన రాజు (30) జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పశువుల కాపరి అయిన రాజు శుక్రవారం బైక్‌పై నిర్మల్‌కు వచ్చాడు. స్థానిక మారమ్మ ఆలయ సమీపంలో అదుపుతప్పి కింద పడ్డాడు. హెల్మెట్ ఎగిరి కిందపడగా తలకు బలమైన గాయమైంది. చికిత్స కోసం అతడిని ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి చనిపోయాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252718]

WANTED

■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185007]

■షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13624]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

ట్ర(డ)బుల్ డ్యూటీలు..!

మంచిర్యాలఅర్బన్: వరుస డ్యూటీలు, నిద్రలేమి, పని ఒత్తిడితో ఆర్టీసీ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. సెలవుల్లో ఉన్నా వారితో పాటు అనారోగ్యం నుంచి కోలుకోని వారికి, డ్యూటీ దిగిన వారికి డబుల్ డ్యూటీలు తట్టుకోలేకపోతున్నారు. డ్యూటీ చేసిన మరుసటి రోజు రెస్ట్ ఉంటుంది..? సిబ్బంది కొరత.. సెలవుల కావాలంటే డబుల్ డ్యూటీలు చేయాలంటూ అధికారుల ఆదేశాలు కాదనలేక విధులకు వెళ్తూ అనారోగ్యాల పాలవుతున్నారు. చదువురానీ వాళ్లకు ఐ–టిమ్స్ విధులు కేటాయిస్తున్నారు. సిబ్బంది కొరతతో బస్సులు రద్దవుతున్న(డిపోకు పరిమితం).. నచ్చినవారికి అవుట్ ఆఫ్ డిసిగ్నేషన్ (ఓడీ) పనులు అప్పగిస్తున్న తీరుపై కథనం..

- సిబ్బంది కొరత పేరిట ఇబ్బందులు
- నచ్చినవారికి ఓడీ విధులు
- రెండ్రోజులుగా నిలిచిపోతున్న బస్సులు



మంచిర్యాల బస్టాండ్‌లో బస్సులు

రెండు రోజుల్లో 14 బస్సులు రద్దు..

మంచిర్యాల డిపోలో 520 మంది విధులు నిర్వహిస్తున్నారు. 250 బస్సులున్నాయి. ఇందులో కండక్టర్లు 215, డ్రైవర్లు 185, గ్యారేజ్ ఉద్యోగులు 75, సూపర్‌వైజర్ ఇతరత్రా 45 మంది ఉద్యోగులున్నారు. ఇందులో కండక్టర్లు, బస్సుల కొరతతో తరుచూ బస్సులు నిలిచిపోతున్నాయి. సాధరణంగా రోజుకు ఒకటి, రెండు బస్సులు నిలిచిపోతాయి. కండక్టర్ల కొరత పేరిట ఇందుకు భిన్నంగా కండక్టర్లు ఇతర పనులు కేటాయించడతో ఈనెల 27న 08, 28న 06 బస్సులు రద్దు చేసుకున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు?

ఓడీలు ఎందుకో..!?

ఆర్టీసీ కొత్త నియామకాలు లేకపోవడం ఉన్న సిబ్బందితోనే సర్దుబాటు చేస్తూ బస్సులు నడిపిస్తున్నారు. అధికారుల ఉదాసీనతతో ఏమో గానీ బస్సులు రద్దు అవుతున్న కండక్టర్లను ఓడీల నుంచి వెనక్కి పంపించకపోవడాన్ని (సొంత విధులకు) కార్మికులు తప్పుబడుతున్నారు. వాస్తవానికి ఓడీలు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కేటాయిస్తుంటారు. డిపోలో ఇష్టానుసారంగా ఓడీల పేరిట విధులు కేటాయించటం ఇక్కడ చర్చానీయంశంగా మారింది. మంచిర్యాల డిపోలో దాదాపు 15 మంది కండక్టర్లు కార్గో, పెట్రోల్‌బంక్, కంప్యూటర్ సెక్షన్‌ల్లో ఓడీల పేరిట విధులు నిర్వహిస్తున్నారు. ఆయా విభాగాల్లో పోస్టులు లేకపోయిన ఇన్‌చార్జిల పేరిట కండక్టర్లకు అవుట్ ఆఫ్ డిసిగ్నేషన్ వేయడం ఎందుకో అధికారులకు తెలియాలి. కార్గోలో 11 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు మరో ఐదుగురు కండక్టర్లు పనిచేస్తున్నారు. చెన్నూర్‌లో సూపర్‌వైజర్ విధులు నిర్వహించాల్సిన చోట కండక్టర్‌ను నియమించారు. బస్సులు రద్దు చేసుకుంటున్నారే తప్ప పాత డ్యూటీలకు పంపకుండా కండక్టర్లను ఓడీలు కొనసాగించడం మాములుగా మారింది. ఏసీ బస్సుల్లో డ్రైవర్‌తో పాటు అటెండర్ ఉండాల్సిన చోట కండక్టర్‌లకు విధుల కేటాయిస్తున్నారు.

ఐ టిమ్ మిషన్‌తో..

టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఐ–టిమ్స్ (ఇంటిలిజెంట్ టిక్కెట్ ఇష్యూ మిషన్) అమల్లోకి రావటంతో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులకు మెరుగైనా సేవలే లక్ష్యంగా ఐటీమ్స్ ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్ రిజర్వేషన్, స్వైపింగ్ సౌకర్యం మిషన్‌లో ఉంటుంది. డ్రైవర్లలో చదువుకున్నది అంతంత మాత్రమే. సాధారణ టిమ్స్‌లో బటన్ సిస్టమ్ ఉండేది. ప్రస్తుతం ఐ–టిమ్స్‌లో టచ్ సిస్టమ్ రావటంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం అంద రూ వెళ్లాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. మిషన్ ఉపయోగించడం అంతగా తెలియని వారిని విధుల నుంచి పక్కనబెడుతున్నారు. ఐ–మిషన్ తీసుకెళ్లనందుకు ఏకంగా 13రోజుల పైగా ఓ డ్రైవర్‌కు విధులు కేటాయించటం లేదు. రెండు రోజుల కిందట మరో డ్రైవర్ ఐ–మి షన్ చేయనందుకు అధికారులు పక్కన బెట్టారు.

ఓటీతో ఇబ్బందులు..

మోటర్ వాహనాల చట్టం ప్రకారం బస్సు నడిపే ప్రతీ ఆర్టీసీ డ్రైవర్‌కు గంట తర్వాత 15 నిమిషాలు విశ్రాంతి ఇవ్వాలి. ఇలా ఎన్ని గంటలు బస్సు నడిపితే అన్ని 15 నిమిషాలు గమ్యం చేరాక విశ్రాంతి ఉండాలని చట్టం చెప్పుతోంది. కానీ పాటించడం లేదు. ఒకరోజు విధులు నిర్వహిస్తే మరుసటి రోజు సెలవు ఇవ్వాలి. అద్దె బస్సులపై పనిచేసే డ్రైవర్లకు మాత్రం రోజు విడిచి రోజు డ్యూటీలకు రావాలని చెబుతున్నా అధికారులు సంస్థ బస్సులపై పనిచేసేవారికి మాత్రం ఓటీ డ్యూటీ చేయాలని చెప్పటం ఎంతవరకు సమంజసమని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశానుసారం..

ఆర్టీసీ యాజమాన్యం ఆదేశానుసారం మేరకు సంస్థలో ఏ నిర్ణయమైన అమలు చేస్తాం. డ్రైవర్‌లు కండక్టర్‌లపై ఒత్తిడి చేయాలని ఉద్దేశం ఏమిలేదు. ఉద్యోగుల కొరత వల్ల ప్రస్తుత పరిస్థితుల్లో డ్యూటీలు వేస్తున్నాం. అత్యవసరం ఉన్న చోట మాత్రమే ఓడీలు ఇస్తున్నాం. ఇది వరకు ఐ–టిమ్స్‌పై డ్రైవర్లపై అవగాహన కల్పించాం. సంస్థ అభివృద్ధి.. బస్సులు నడవాలంటే ప్రతి ఒక్కరూ ఆయా డ్యూటీలు చేయాలి.

– రవీంద్రనాథ్, డిపో మేనేజర్, మంచిర్యాల

మ్యాన్‌రైడింగ్ రోప్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మేనేజర్ లక్ష్మినారాయణ

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిలో శుక్రవారం మ్యాన్‌రైడింగ్ రోప్ పనులను గని మేనేజర్ లక్ష్మినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల అవసరం నిమిత్తం ఏప్రిల్‌లో పనులు పూర్తి చేసి మ్యాన్‌రైడింగ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీంతో కార్మికుల హాజరుశాతం సైతం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే మ్యాన్‌రైడింగ్ చేర్‌లు వచ్చాయని, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంజినీరింగ్ పర్యవేక్షణలో పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రక్షణాధికారి సంతోష్‌రావు, ఇంజినీర్ రఘు, కృష్ణ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ నాయకులు తిరుపతి, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, పెట్టం శ్రీనివాస్, సుభాష్ చంద్రబోస్, శంకరయ్య ఉన్నారు.

'మాలమాదిగల మధ్య చిచ్చు పెడుతున్న కడియం'

పాతమంచిర్యాల: మాల మాదిగల మధ్య కడియం శ్రీహరి చిచ్చుపెడుతున్నాడని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మాలమహానాడు నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం శ్రీహరి 25ఏళ్లుగా మాల మాదిగలను విడగొట్టే కుటిల రాజకీయాలు చేస్తున్నారని, అధికారం కోసం ఏదైనా చేస్తాడన్నారు. నిన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉండి అధికారం కోల్పోగానే కాంగ్రెస్‌లో చేరడం ఆయన నిజాయితీకి నిదర్శమన్నారు. ఆయన కూతురు కావ్యకు కాంగ్రెస్ పార్టీ వరంగల్ టికెట్ ఇవ్వొద్దని కోరారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి గద్దల తిరుపతి, జిల్లా కోశాధికారి కృష్ణంరాజు పాల్గొన్నారు.

నాడు తండ్రి.. నేడు తల్లి మృతి



తల్లి మృతదేహం వద్ద చిన్నారులు

- అనాథలైన చిన్నారులు
- దహన సంస్కారాలకు విరాళాల సేకరణ
- చిన్నారులను ఆదుకోవాలని కోరుతున్న స్థానికులు



అగ్గి పట్టిన చిన్న కుమారుడు

మందమర్రిరూరల్: ఆరు నెలల క్రితం జరిగిన ప్రమాదంలో తండ్రి మృతి చెందగా... అనారోగ్యంతో తల్లి గురువారం రాత్రి మృతి చెందింది. దీంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. ఆ తల్లి అంత్యక్రియలకు సైతం డబ్బులు లేకపోవడంతో స్థానికులు విరాళాలు సేకరించి దహన సంస్కారాలు పూర్తి చేశారు. వృద్ధావయస్సులోని అమ్మమ్మ వద్ద బిక్కుబిక్కుమంటూ ఆ చిన్నారుల చూపులు అక్కడి వారిని కలిచివేశాయి. స్థానికుల వివరాల ప్రకారం... మందమర్రి పట్టణంలోని మొదటి జోన్ ప్రాంతానికి చెందిన శ్యాం, భూమక్క దంపతులకు ఆర్తీక్ (6), కార్తీక్(4) ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్యాం సెంట్రింగ్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి భూమక్క తన తల్లి కనుకమ్మ వద్ద ఇద్దరు పిల్లలతో జీవిస్తోంది. ఇటీవల భూమక్కకు మెదడులో కణితి ఏర్పడింది. ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో 15 రోజుల క్రితం చేరింది. అక్కడి వైద్యులు ఆపరేషన్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించడంతో వైద్యులు ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. గురువారం సాయంత్రం ఇంటికి తీసుకొచ్చాక మృతి చెందింది.

చిన్న కుమారుడితో అంత్యక్రియలు...

చిన్నారులు ఆర్తీక్, కార్తీక్ ఇంటి సమీపంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో చదువుకుంటున్నారు. అయితే మరణమంటే ఏమిటో తెలియని వయసులో పెద్ద కుమారుడు తండ్రికి అంత్యక్రియలు నిర్వహించగా చిన్న కొడుకు కార్తీక్ తల్లికి అంత్యక్రియలు చేశాడు. తల్లి మృతదేహం వద్ద చిన్నారుల రోదన అక్కడి వారిని కలిచివేసింది. అసలే నిరుపేద కుటుంబం కావడం.. అమ్మమ్మ వద్ద చిన్నారులతో తల్లి జీవిస్తుండగా.. అంత్యక్రియలకు సైతం డబ్బులు లేని పరిస్థితిలో ఉండగా విషయం తెలుసుకున్న కాలనీవాసులు చందాలు వేసుకున్నారు. సోపతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సేకరించిన రూ.13వేలు అందించారు. అనాథలైన చిన్నారులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

మున్సిపల్ మేనేజర్‌కు మెమో

సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌కు మెమో జారీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ ఆదేశించారు. 'సెలవు రోజుల్లోనూ సంతకాలు' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్ర చురితమైన కథనానికి ఆయన స్పందించారు. సెలవు పెట్టి మరుసటి రోజు డ్యూటీ చేసినట్లు హాజరు రిజిష్టర్‌లో సంతకాలు చేసిన వైనాన్ని వెలుగులోకి తీసుకు రాగా.. వెంటనే మేనేజర్‌కు మెమో జారీ చేసి వివరణ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. మేనేజర్ ఇచ్చే సంజాయిషీ తర్వాత పూర్తి స్థాయిలో విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని గోదావరి చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బజ్జూరి రాజన్న (55) మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. చెన్నూర్ పట్టణానికి చెందిన బజ్జూరి రాజన్న, పద్మలు బుధవారం రాత్రి పంట చేనుకు వెళ్లి మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తున్నారు. అలాగే చెన్నూర్ మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన కడారి సంతోశ్ చింతలపల్లికి మోటార్ సైకిల్‌పై చెన్నూర్‌కు వస్తుండగా గోదావరి చౌరస్తా వద్ద రాజన్న మోటార్ సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో రాజన్న తీవ్ర గాయాలు కాగా పద్మకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాల పాలైన రాజన్నను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆస్పత్రి తరలించారు. చికిత్సలు పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏఐటీయూసీ ఫిట్ కమిటీ ఎన్నిక



వివరాలు డీవైసీఎంవోకు అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ డిపార్ట్‌మెంట్ ఫిట్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఆర్కే 8 డిస్పెన్సరీ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదాలు హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో ఫిట్ సెక్రెటరీగా విజయలక్ష్మి, ఫిట్ సహాయ కార్యదర్శిగా బోయిని రమణ, సంయుక్త కార్యదర్శిగా జి.శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొల్లూరు తిరుపతి, కోశాధికారిగా ముద్దసాని మల్లేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా అరుణకుమారి, విజయలక్ష్మి, మంజుల, నాగేంద్ర వర్మ, లింగమూర్తిలు ఎన్నికయ్యారు. అనంతరం డీవైసీఎంవో రమేశ్‌బాబును కలిసి కమిటీ వివరాలను అందించారు. నూతన కమిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందని నేతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టె కిషన్‌రావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ మెడికల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ప్రచారం



చెన్నూర్ ఎమ్మెల్యేతో ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని 19వ వార్డు విద్యానగర్‌లో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో కలిసి శుక్రవారం మందమర్రిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతిగుర్తుకు ఓటేయాలని అభ్యర్థించాడు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని వివరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

మందమర్రిలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం



ఓటు అభ్యర్థిస్తున్న కొప్పుల ఈశ్వర్

మందమర్రిరూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం మందమర్రిలో ప్రచారం నిర్వహించారు. ఉదయాన్నే ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్‌తో కలిసి ఈశ్వర్ సింగరేణి హైస్కూల్ మైదానంలోని వాకర్స్‌ను కలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌లో పార్టీ కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేశాడు. మార్కెట్‌లోని కూరగాయల వ్యాపారులను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించాడు. ఆనయ వెంట బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనం.. రైతుకు మేలు




- కొన్నేళ్లుగా అందని వైనం
- వచ్చే వానాకాలం నుంచి ఆరంభం

మంచిర్యాలఅగ్రికల్చర్: వచ్చే వానాకాలం నుంచి పంటల సాగుకు రాయితీపై విత్తనాలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత కొన్నేళ్లుగా విత్తనాలపై రాయితీ నిలిచిపోయింది. సేంద్రియ కర్షనంగా వినియోగించే విత్తనాలు మాత్రమే అందజేసింది. ప్రైవేటు డీలర్ల వద్ద సాగుకు కొనుగోలు చేశారు. జిల్లాలో అధికంగా పత్తి, వరి, కంది, మొక్కజొన్న, పెసర, శనగ పంటల సాగు విస్తీర్ణం ఉంటుంది. పత్తి మినహా వరి, కంది, పెసర, శనగ, సోయా పంట విత్తనాలు 33శాతం రాయితీపై గత ప్రభుత్వం 2017వరకు అందజేసింది. జీలుగ, జనుము, పిల్లిపెసర, దాయించా విత్తనాలు 50 శాతం రాయితీపై అందజేశారు. జిల్లాలో గతేడాది వరకు జనుము, జీలుగ విత్తనాలు మాత్రమే అందజేశారు. వచ్చే వానాకాలం సీజన్ నుంచి విత్తనాలపై సబ్సిడీకి ప్రభుత్వం గురువారం నిర్ణయించింది. వరి, మొక్కజొన్న, కంది, పెసర, సోయాబీన్, మినుము విత్తనాలపై 33 నుంచి 35 శాతం వరకు, జీలుగ, జనపనార, పిల్లిపెసర, తదితర విత్తనాలపై 50నుంచి 65 శాతం రాయితీ ఇవ్వాలని వ్యవసాయ శాఖ భావిస్తోంది.

తగ్గనున్న ఆర్థిక భారం..

జిల్లాలో వచ్చే వానాకాలంలో 3.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో పత్తి 1.60 లక్షల ఎకరాలు, వరి 1.55 లక్షల ఎకరాలు, కంది 20 వేల ఎకరాలు, పెసర 3,550, మొక్కజొన్న 4,200 ఎకరాలు, ఇతర మినుములు, సోయా తదితర పంటలు 10 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. పత్తి విత్తనాలు 2.20 లక్షల ప్యాకెట్లు, వరి 44,500 క్వింటాళ్ల విత్తనాలు ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేస్తున్నారు. కంది, సోయా, మినుములు, మొక్కజొన్న, వంటి విత్తనాలకు రైతులు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. మొక్కజొన్న విత్తనాలు 2700క్వింటాళ్లు, సోయా 650, కంది 1700, పెసలు 200, మినుములు 60, దాయించా, జీలుగ 52,000, పొద్దుతిరుగుడు 220 క్వింటాళ్లు అవసరం కానున్నాయి. పత్తి విత్తనాలు మినహా ఇతర విత్తనాలు రాయితీపై అందజేస్తే జిల్లా రైతులపై రూ.30 కోట్ల భారం తగ్గనుంది.

సాగు సమయానికి అందించాలి



గత కొన్నేళ్లుగా సబ్సిడీ విత్తనాలు ఇవ్వడం లేదు. ఈ వానాకాలం సబ్సిడీ విత్తనాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సాగు ఖర్చు తగ్గనుంది. ఏటా విత్తనాలకు వేలకు వేలు చెల్లించాల్సి వస్తుంది. తొలకరి వర్షాలు పడే సమయానికి అందిస్తేనే ఉపయోగ పడుతుంది.

– భీమరాజుల మల్లేష్, నెన్నెల

అవసరం ఉన్నవి అందించాలి



ఎక్కువగా వరి సాగు చేస్తున్నాం, అవసరం ఉన్న డీలర్ల వద్ద 25 కిలోల ఒక్కో బ్యాగు రూ.1200 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నాం. డిమాండ్ ఎక్కువగా ఉంటే ఈ ధర మరో రూ.500 వరకు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుంది. అవసరం ఉన్న సన్నరకం విత్తనాలు రాయితీపై అదించాలి.

– అక్కల లింగయ్య, చెన్నూర్

అధిక ధరలు

ప్రస్తుతం విత్తనాలను అధిక ధరకు ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేస్తున్నారు. వరి కిలో విత్తనాలకు రూ.35 నుంచి రూ.40, కందులు కిలో రూ.270 నుంచి రూ.360, మొక్కజొన్న, పెసర రూ.250 నుంచి రూ.300 వరకు విత్తనాల కంపెనీలను బట్టి ధరలు ఉన్నాయి. డిమాండ్ ఉన్న కంపెనీల విత్తనాలు రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. అయితే రాయితీ విత్తనాలతో రైతులకు అధిక ధరల భారం తప్పనుంది.

మండల వాసీని వరించిన ఎంపీ సీటు



తిమ్మాపూర్‌లోని ఆత్రం సుగుణ తల్లిగారిల్లు



ఆత్రం సుగుణ

- ఆత్రం సుగుణ తల్లిగారి ఊరు తిమ్మాపూర్
- అత్తగారిల్లు మురిమడుగు
- ఎంపీటీసీగా రాజకీయ అరంగ్రేటం

జన్నారం: ఇదివరకే పెద్దపెల్లి ఎంపీగా కొనసాగుతున్న బోర్లకుంట వెంకటేశ్ నేత తిమ్మాపూర్ వాసి కాగా, ప్రస్తుతం ఉత్కంఠ మధ్య ఆదిలాబాద్ ఎంపీ సీటు ఎట్టకేలకు జన్నారం మండల వాసిని వరించింది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామ వాసి. అయితే జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కనక రాజు, బుదవ్వలకు ఇద్దరు కూతుర్లు, ఒక్క కుమారుడు. పెద్ద కూతురు ఆత్రం సుగుణ. 1 నుంచి 3 వ తరగతి వరకు తిమ్మాపూర్ గ్రామంలో చదివారు. 4 నుంచి పదో తరగతి వరకు తపాలపూర్ ఉన్నత పాఠశాలలో చదివారు. బీఎడ్ పూర్తి చేశారు. జన్నారం మండలం మురిమడుగు గ్రామ పంచాయతీ కొమ్ముగూడెంకు చెందిన ఆత్రం భుజంగరావుతో 1992 వివాహం జరిగింది. 1995లో మురిమడుగు ఎంపీటీసీగా ఆత్రం సుగుణ గెలుపొందారు. అప్పటి నుంచి రాజకీయ అరంగ్రేటం చేశారు. 2008లో పడిన డీఎస్సీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడంతో 2010లో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగంలో చేరారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం రావడంతో 2000 సంవత్సరంలో ఉట్నూర్‌కు మకాం మార్చారు.

తిమ్మాపూర్‌లో సంబరాలు...

తిమ్మాపూర్ గ్రామ నివాసి ఆత్రం సుగుణకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీటు కేటాయించడంతో తిమ్మాపూర్ గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు కనక వెంకటస్వామి, చంద్రయ్య లతో పాటు పలువురు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. మా గ్రామ ఆడబిడ్డకు ఎంపీ సీటు దక్కడం ఆనందంగా ఉందని, అందరం కష్టపడి గెలుపించుకోవాలని పేర్కొన్నారు.